# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు హైదరాబాద్ లో 9 వేల 400 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

- భారత ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయడంలో రాజ్యాంగం, న్యాయవ్యవస్థ కీలక పాత్ర పోషించాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

- రానున్న 24 గంటల పాటు గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వడగాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

- రాయ్‌పూర్ వేదికగా ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలంగాణను తయారీ కేంద్రంగా నిలపడం, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు హైదరాబాద్ లో 9 వేల 400 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధాని మాట్లాడుతూ.. దేశం ప్రస్తుతం "రిఫార్మ్స్ ఎక్స్‌ప్రెస్" వేగంతో ముందుకు సాగుతోందని, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనలో కొత్త పుంతలు తొక్కుతోందని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఏర్పడే ఇంధన సంక్షోభాన్ని కేంద్ర ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొంటోందని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రస్తుత తరుణంలో ఇంధనాన్ని పొదుపుగా వాడటం ఎంతో అవసరమని, దీనివలన విదేశీ మారక ద్రవ్యం ఆదా అవ్వడమే కాకుండా... అంతర్జాతీయ ఘర్షణల ప్రభావం మనపై తక్కువగా వుంటుందన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తిలో భారత్ నేడు ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని ప్రధాని వెల్లడించారు. తెలంగాణ ప్రజల కలలను సాకారం చేసేందుకు కేంద్రం మరింత వేగంతో పని చేస్తుందని హామీ ఇచ్చారు. సుమారు 1,700 కోట్ల రూపాయలతో వరంగల్‌లో నిర్మించిన 'కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్'ను ప్రధానమంత్రి ప్రారంభించారు. దేశంలోనే పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన మొదటి "పీఎం మిత్ర" పార్క్ ఇదే కావడం విశేషం. వ్యవసాయం (Farm), దారం (Fibre), కర్మాగారం (Factory), ఫ్యాషన్ (Fashion), విదేశీ మార్కెట్ (Foreign) అనే "5ఎఫ్" సూత్రంతో వస్త్ర రంగాన్ని బలోపేతం చేస్తామని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అలాగే, గుడేబెల్లూరు–మహబూబ్‌నగర్ జాతీయ రహదారి (NH-167) నాలుగు లైన్ల విస్తరణ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. కాజీపేట-విజయవాడ రైలు మల్టీ-ట్రాకింగ్ కారిడార్, కాజీపేట బైపాస్ లైన్లతో పాటు హైదరాబాద్‌లో కొత్తగా నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (POL) టెర్మినల్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా తలెత్తే వరదలు, వడగాలుల పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, ముందస్తు సన్నద్ధతపై సమీక్షించారు. ప్రాణనష్టం లేకుండా.. ఆస్తి నష్టం తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల సంసిద్ధత, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, వనరుల సమీకరణ, వివిధ విభాగాల మధ్య సమన్వయంపై అమిత్ షా చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తమిళగ వెట్రి కళగం (టీవీకే) వ్యవస్థాపకుడు సి. జోసెఫ్ విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ఈరోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు. చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన వేడుకలో ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. విజయ్‌తో పాటు మరో 9 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు కోలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సి. జోసెఫ్ విజయ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా అభినందనలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీ వేదికగా ఈ నెల 31న నాల్గవ “భారత్-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్” జరగనుంది. ఈ సదస్సుకు ఆఫ్రికా ఖండంలోని వివిధ దేశాల అధ్యక్షులు, ప్రధానులు హాజరుకానున్నారు. శిఖరాగ్ర భేటీకి ముందుగా.. మే 28న ఉన్నతాధికారుల సమావేశం, 29న విదేశాంగ మంత్రుల చర్చలు జరగనున్నాయి. ఆర్థికాభివృద్ధి, వాణిజ్యం, రక్షణ, భద్రత, కీలక ఖనిజాలు, ఇంధనం, అంతరిక్షం వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని అధికారిక వర్గాలు తెలిపాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సేవ, ఆధ్యాత్మికత, సామాజిక పరివర్తనలో “ఆర్ట్ ఆఫ్ లివింగ్” సంస్థ పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో ఈరోజు జరిగిన 45వ వార్షికోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. అనంతరం సభను ఉద్దేశించి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. రాజకీయ వ్యవస్థల కంటే సామాజిక భాగస్వామ్యమే అత్యంత శక్తివంతమైనదని, దేశ నిర్మాణానికి ఇది ఎంతో కీలకమని పేర్కొన్నారు. పర్యావరణ బాధ్యత, యువత సాధికారత, అంతర్గత శ్రేయస్సు ద్వారా “వికసిత్ భారత్” లక్ష్యాన్ని చేరుకోవాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో ఆధ్యాత్మిక కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయడంలో రాజ్యాంగం, న్యాయవ్యవస్థ కీలక పాత్ర పోషించాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొనియాడారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా రచించిన రెండు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. భారతీయ సమాజం వ్యవస్థల పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని విజయవంతంగా నిలబెట్టుకుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఎక్కడ అన్యాయం జరిగినా.. తమను రక్షించడానికి రాజ్యాంగం ఉందని, హక్కులకు భంగం కలిగితే కోర్టులు కచ్చితంగా స్పందిస్తాయన్న భరోసా నేడు ప్రతి పౌరుడిలోనూ కనిపిస్తోందని అమిత్ షా పేర్కొంటూ…

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నావికాదళం పశ్చిమ నౌకాదళ కమాండ్ తదుపరి ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన్ నియమితులయ్యారు. ముంబై ప్రధాన కేంద్రంగా పనిచేసే ఈ కమాండ్.. అరేబియా సముద్రంలోని కీలక సముద్ర మార్గాలను, దేశ పశ్చిమ తీర రక్షణను పర్యవేక్షిస్తుంది. సంజయ్ వాత్సాయన్ ప్రస్తుతం నౌకాదళ వైస్ చీఫ్‌గా సేవలందిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ద్వాదశ జ్యోతిర్లింగాల్లో మొదటిదైన సోమనాథ్ క్షేత్రం పునర్ నిర్మాణం జరిగి 75 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న “సోమనాథ్ అమృత్ పర్వ్” వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు హాజరుకానున్నారు. కేవలం ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా.. పర్యావరణ పరిరక్షణలోనూ ఈ ఆలయం రికార్డులను సృష్టిస్తోంది. దేశంలోనే మొట్టమొదటి కర్బన ఉద్గార రహిత ఆలయంగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా రాయ్‌పూర్ వేదికగా ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన బెంగళూరు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోగా… బ్యాటింగ్ ప్రారంభించిన ముంబై ఇండియన్స్ 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టానికి 82 పరుగులు చేసింది. మరోవైపు చెన్నైలోని ఎం. ఎ. చిదంబరం స్టేడియం వేదికగా జరిగి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుపై చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 24 గంటల పాటు గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో వడగాలులు వీస్తాయని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. పశ్చిమ రాజస్థాన్‌లో రానున్న నాలుగైదు రోజుల పాటు రాత్రి సమయాల్లోనూ ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయని పేర్కొంది. వాయువ్య భారతంలో రానున్న వారం రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు క్రమంగా పెరిగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. మరోవైపు కేరళం, మాహే, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో రానున్న 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండు మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ సహా ఈశాన్య భారతం, అండమాన్ నికోబార్ దీవులు, బీహార్, జార్ఖండ్, లక్షద్వీప్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ 44 ఏళ్ల తర్వాత తొలిసారి ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌కు ఆతిథ్యం ఇస్తోంది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో రేపటి నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీ ఈనెల 17న ముగుస్తుంది. 28 దేశాల నుండి 180 మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్ అర్హత సాధనలో ఈ ఛాంపియన్‌షిప్ కీలక పాత్ర పోషించనుంది.

==============================
==============================